అవిశ్వాస తీర్మానంలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌ల అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. అవిశ్వాస తీర్మానం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ జారీచేసిన నోటీసులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మేయర్, డిప్యూటీ మేయర్ వేర్వేరుగా దాఖలు చేసిన అప్పీళ్లను బుధవారం కొట్టివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది.

ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ నియామకంపై నోటీసులు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా జీ వైజయంతి నియామకాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. సీఆర్‌పీసీ స్థానంలో కొత్తగా వచ్చిన బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 25ఏ(2) ప్రకారం ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ పోస్టులో వైజయంతి కొనసాగడానికి అర్హత లేదని పేర్కొంటూ లాయర్ ఎస్ ఎల్ శ్రీనివాసులు ఇతరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారించారు. చట్ట విరుద్ధంగా వైజయంతి పదవిలో కొనసాగుతున్నారని పిటిషనర్ న్యాయవాది వాదించారు. బీఎన్ఎస్ఎస్‌లోని నిబంధనల ప్రకారం పదేండ్లకు తక్కువ కాకుండా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయాలన్న నిబంధన ఉందని తెలిపారు. ప్రాసిక్యూషన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ల నియామకానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతి అవసరమని కూడా చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు ప్రభుత్వంతోపాటు వైజయంతికి నోటీసులు జారీ చేసింది.

విరించి దవాఖానకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): దవాఖానలోని వ్యర్థాలను నివాస ప్రాంతంలో గొయ్యి తీసి కప్పెట్టేస్తున్నారనే కేసులో హైదరాబాద్ ప్రేమ్‌నగర్‌లోని విరించి దవాఖాన యాజమాన్యానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ, కాలుష్య నియంత్రణ మండళ్లకు కూడా నోటీసులు పంపింది. తన ఇంటి పక్కనే గుంతలు తవ్వి దవాఖాన వ్యర్థాలను పాతిపెడుతున్నారంటూ ఖైరతాబాద్‌కు చెందిన రిజ్వాన్‌ఖాన్ వేసిన పిటిషన్‌ను బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రతివాదుల వాదనలు వినకుండా ఉత్తర్వులు జారీ చేయబోమని స్పష్టం చేసిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

'ఆర్టీసీ నోటిఫికేషన్ల' ఆన్‌లైన్ లింకులను నమ్మవద్దు: సజ్జనార్

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో భర్తీ చేసే ఉద్యోగాలపై ఎండీ వీసీ సజ్జనార్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఉద్యోగ నోటిఫికేషన్ల పేరిట ఆన్‌లైన్‌లో వస్తున్న లింకులను నమ్మవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మేరకు సంస్థలో 3035 కొలువుల భర్తీకి టీజీఎస్ఆర్టీసీ కసరత్తు ప్రారంభించిందని సజ్జనార్ పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటూ కొన్ని లింక్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని తెలిపారు. అర్హతలు, దరఖాస్తు ఫీజు, తదితర వివరాలను అందులో పేర్కొన్నట్టు వివరించారు. అవన్నీ ఫేక్ అని, ఆ లింక్‌లను నమ్మవద్దని..క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని ఆర్టీసీ ఎండీ విజ్ఞప్తి చేశారు.

విజయవాడ కిడ్నీ రాకెట్‌లో ఐదుగురిపై కేసు నమోదు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ) : విజయవాడలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ వ్యవహారంలో పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. బాషా, వెంకట్, సుబ్రహ్మణ్యంతో పాటు డాక్టర్ శరత్‌బాబు, కిడ్నీ స్వీకరించిన వెంకటేశంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కిడ్నీ కోల్పోయిన మధుబాబుకు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మధుబాబు అనే యువకుడికి విజయవాడకు చెందిన బాషా సోషల్ మీడియాలో పరిచయమయ్యాడు. మధుబాబు అవసరాన్ని ఆసరాగా చేసుకున్న బాషా.. కిడ్నీ దానం చేస్తే రూ.30 లక్షలు ఇప్పిస్తానని నమ్మబలికి ఈ నెల మొదటి వారంలో విజయవాడలోని విజయ హాస్పిటల్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి కిడ్నీ తీసుకున్నారు. ఆపరేషన్ తర్వాత మధుబాబుకు 30 లక్షలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 1.10 లక్షలు ఇచ్చారు. మిగిలిన డబ్బు అడిగేసరికి స్నేహితుడిలా కిడ్నీ దానం చేసినట్టు సంతకం చేశావని, మిగిలిన డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ బాషా బెదిరించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు డాక్టర్ శరత్‌బాబు, బాషాపై గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

వార్తలపై సంయమనం పాటించండి

ఫోన్ ట్యాపింగ్ కేసులో పత్రికలు, టీవీలకు హైకోర్టు సూచన

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసు వార్తలను ప్రచురించే, ప్రసారం చేసే ముందు పత్రికలు, టీవీలు సంయమనం పాటించాలని హైకోర్టు సూచించింది. గత వారం పత్రికల్లో న్యాయమూర్తుల, వారి కుటుంబసభ్యుల పేర్లు ఫోన్ నంబర్లను పత్రికలో ప్రచురించినట్టు (నమస్తే తెలంగాణ కాదు) గుర్తించామని, ఇలాంటి సున్నిత విషయాల్లో మీడియా సంయమనం పాటించాలని హితవు చెప్పింది. ఎస్ఐబీ అదనపు ఎస్పీ (సస్పెన్షన్‌లో ఉన్నారు) భుజంగరావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రాజకీయ ప్రత్యర్థులు ప్రైవేటు వ్యక్తులతోపాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నట్టు పత్రికల్లో వార్త లు వచ్చాయి. ఆ కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. కౌంటరు దాఖలు చేశామని రా ష్ట్రం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు. కేంద్రం గడువు కోరగా ఈ సమయంలోనే వార్తల విషయంలో అప్రమత్తత పాటించాలని హైకోర్టు సూచిస్తూ విచారణను 23కు తేదీకి వాయిదా వేసింది.

ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు: ప్రభాకర్‌రావు

నాంపల్లి కోర్టులు: ఇప్పట్లో భారత్ తిరిగి వచ్చే అవకాశం లేదని, విచారణ అధికారికి పూర్తిగా సహకరిస్తానని ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వెల్లడించారు. ఈ మేరకు విచారణ అధికారి, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఓ లేఖ రాశారు. క్యాన్సర్‌తోపాటు కొత్తగా గుండె, మూత్రకోశ సంబంధిత వ్యాధుల వల్ల బాధపడుతున్నానని, చికిత్స నిమిత్తం అమెరికాలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రయాణం ప్రమాదమని వైద్యులు సలహా ఇచ్చారన్నారు.

మూడోసారి చార్జిషీట్ వెనక్కి

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరస్కరించిన కోర్టు

నాంపల్లి కోర్టులు : ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడోసారి పోలీసులు దాఖలుచేసిన చార్జిషీట్‌ను కోర్టు వెనక్కి పంపింది. చార్జిషీట్‌లో పేర్కొన్న సాక్ష్యాధారాలను, కీలక పత్రాలను పూర్తిస్థాయిలో సమర్పించలేదని పేర్కొంది. పంజాగుట్ట ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో అదనపు కీలక పత్రాలను కోర్టుకు సమర్పించారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం 65-బీ కింద కోర్టుకు జమ చేయాల్సిన పెన్‌డ్రైవ్‌లు, సీడీలను సమర్పించకపోవడంతో ఇటీవల కోర్టు అనుమతి కోరారు. ఆ తర్వాత ఆ యా వస్తువుల్ని సమర్పించినట్టు పోలీసు అధికారులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి ద్వారా కోర్టుకు తెలిపారు. అయినా అభియోగపత్రాల్లో సూచించిన విధంగా అన్ని వస్తువులు సమర్పించలేదని కోర్టు తెలిపింది. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి చార్జిషీట్‌ను తిప్పి పంపించింది. మూసీ నదిలో లభించిన కీలక అధారాలను కోర్టుకు సమర్పించలేదని, చార్జిషీట్‌లో పేర్కొన్న విధంగా ఆధారాలను, కీలక పత్రాలను సరిచూసుకోవాలని ఆదేశించింది. ఎస్ఐబీ టాస్క్‌ఫోర్స్ మాజీ అధికారి ప్రభాకర్‌రావును, ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్‌ను ఇప్పటివరకు అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం.

ముషారఫ్ ఫారూఖీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ నేతలు

అదానీకి ఎట్లిస్తరు?

మొదటిపేజీ తరువాయి...

ముషారఫ్ ఫారూఖీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ విద్యుత్తు సరఫరాను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నష్టాల సాకుతో పంపిణీ వ్యవస్థను ప్రైవేటీకరించడం సరికాదని అన్నారు. ప్రైవేట్ కంపెనీలు లాభాపేక్షతో వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతాయని, కొన్ని రాష్ట్రాల్లో విద్యుత్తు పంపిణీ ప్రైవేటీకరణ, ఫ్రాంచైజీ ప్రయోగాలు ఆశించిన ఫలితాలివ్వలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ సౌత్ సర్కిల్లో నష్టాలను యాజమాన్యం మద్దతుతో తగ్గించుకోవచ్చని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని సీఎండీని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జీ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ఏ వెంకట నారాయణరెడ్డి, పీ సదానందం, వేణు, శ్రీనివాస్, జనప్రియ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ సిలబస్‌లో భారీ మార్పులు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్‌లో థియరీకి 60శాతం, ప్రాక్టికల్స్‌కు 40శాతం చొప్పున వెయిటేజీని అమలు చేయనున్నారు. ఇదివరకు 50 శాతం చొప్పున వెయిటేజీ ఉండేది. సీ -24 పేరుతో పాలిటెక్నిక్ కొత్త కరికులాన్ని సాంకేతిక విద్యాశాఖ అధికారులు రూపొందించారు. దీన్ని 'ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్' (ఎన్ఐటీటీటీఆర్) ఆ మోదానికి పంపించారు. ఆమోదం పొందితే 2024 -27 వరకు మూడేండ్ల పాటు కరికులం అమల్లో ఉంటుంది. దీని రూపకల్పనకు అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేశారు. చైనా, మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి దేశాల్లోని కరికులాన్ని అధ్యయనం చేస్తున్నారు. 'ఔట్ కమ్ బేస్డ్' కరికులమే లక్ష్యంగా విద్యార్థులకు పరిశ్రమల్లో ఆరునెలల శిక్షణను తప్పనిసరి చేస్తున్నారు. యాడ్ ఆన్ కోర్సులు, మైనర్ కోర్సులకు ప్రాధాన్యమిచ్చారు. మేజర్ కోర్సుల్లోని ఈసీఈ విద్యార్థులు ఎలక్ట్రానిక్స్‌ను మేజర్‌గా, సీఎస్ఈ కోర్సులోని ఏఐని మైనర్ ప్రోగ్రాంగా తీసుకోవచ్చు. ఎన్‌పీటీఎల్, స్వయం పోర్టల్లో కోర్సులను ఎంచుకోవచ్చు.

ఇంకా ఎందరు చనిపోవాలి?

- కుక్కలు పిక్కలు పీకుతున్నయ్!
- పిల్లల ప్రాణాలు పోతున్నయ్
- వీధి కుక్కలపై చర్యలు కావాలి
- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ధనవంతుల కాలనీలు కాదు.. మురికివాడలపై దృష్టి పెట్టాలి
- వారంలోనే నిపుణులతో సలహా కమిటీ వేయాలి: హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలపై లెక్కలు సమర్పిస్తే చాలదని, అసలు గణాంకాలే వద్దని, చర్యలు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. ఇప్పటికే వీధి కుక్కలు పిల్లలపై పడి కరవడంతో పలువురు చనిపోయారని, ఇంకా ఎంత మంది చనిపోయే వరకు ఆగాలని నిలదీసింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న లెక్కల వివరాలు ముఖ్యం కాదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోబోయే చర్యలు ఏమిటో చెప్పాలని స్పష్టం చేసింది. బుధవారం వీధికుక్కల దాడులపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టీ వినోద్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. ఒక పక్క పిల్లలు చనిపోతుంటే, తీసుకున్న చర్యలతో కౌంటర్ వేశామంటే ఎలా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. జూబ్లీహిల్స్‌లో 350, బంజారాహిల్స్‌లో 250 కుక్కలకు స్టెరిలైజేషన్ చేశామని చెప్పి, మళ్లీ అదనపు కౌంటర్ దాఖలు వేసేందుకు తిరిగి గడువు కోరటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని అభిప్రాయపడింది. వీధికుక్కల బాధితులు మురికివాడల్లో ఉన్నారని, అధికారులేమో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ఖరీదైన ధనవంతుల కాలనీల్లో చర్యలు తీసుకుంటే ఎలాగని నిప్పులు చెరిగింది. కుక్క కాటు ఘటనలు ధనవంతుల కాలనీల్లో జరగటం లేదని, పేదలు నివసిస్తున్న మురికివాడల్లోనే జరుగుతున్నాయని గుర్తుచేసింది. మురికివాడలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని తేల్చిచెప్పింది. అధికారులు ఈ సమస్యను మానవీయకోణంలో చూడాలని, సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు ఉండాలని సూచించింది. ఇదేదో ఒక వ్యవహారంగా పరిగణించవద్దని, తక్షణ చర్యలు తీసుకునేలా అధికారులు స్పందించాలని స్పష్టం చేసింది. వారంలోగా జీహెచ్ఎంసీ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. తేలిగ్గా తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తున్నామని, అప్పటికి కుక్కల దాడుల నివారణకు తీసుకున్న చర్యలు, కార్యాచరణ ప్రణాళికలను నివేదించాలని స్పష్టం చేసింది.

అమాస చీకట్లో.. బడినిద్ర!

- దెయ్యాలు లేవని నిరూపించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడి ప్రయత్నం
- ఒంటరిగా నిద్రించి ధైర్యం నింపిన రవీందర్‌రెడ్డి

ఆనందపూర్ పాఠశాలలో నిద్రిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి

ఆదిలాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలో దెయ్యం ఉన్నదని విద్యార్థులు కొంతకాలంగా భయపడుతున్నారు. అమావాస్య రోజు రాత్రి ఒంటరిగా పాఠశాలలో నిద్రించి దెయ్యం లేదని నిరూపించి విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఆనందపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఈ నెల 2న ఉపాధ్యాయుడు (జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి) నూతల రవీందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఓ రోజు తరగతి గదిలో పాఠం చెబుతుండగా బయట శబ్దం రావడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎందుకు భయపడుతున్నారని అడగ్గా బడిలో దెయ్యం ఉంది సార్ అని చెప్పారు. విద్యార్థుల్లో ఉన్న దెయ్యం భయాన్ని తొలగించడానికి ఉపాధ్యాయుడు రవీందర్ శుక్రవారం అమావాస్య రాత్రి ఒంటరిగా పాఠశాలలో పడుకున్నారు.

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో ఘటనలు

మోతె రాజు   లింగయ్య (ఫైల్)

చిల్పూరు/కాటారం, జూలై 10: సాగు కోసం చేసిన అప్పులు తీరక, పెట్టుబడి సాయం అందక, రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని కొండాపూర్‌కు చెందిన మోతె రాజు (37)కు 3 ఎకరాల 20 గుంటల భూమి ఉన్నది. మూడు, నాలుగేండ్లుగా పంటల సాగు కోసం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చలేనని మనోవేదనకు గురైన రాజు బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య వెంటనే 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బస్వాపూర్‌లో కౌలురైతు బలవన్మరణం

భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బస్వాపూర్‌కు చెందిన కళ్లెం లింగయ్య (35) రెండున్నర ఎకరాల భూమి కౌలుకు తీసుకుని రెండేండ్లుగా పత్తి సాగు చేస్తున్నారు. సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని పోషించే మార్గం కనిపించక మంగళవారం రాత్రి లింగయ్య పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి భూపాలపల్లి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

హుస్సేన్ అరెస్ట్ ఓ కట్టుకథ

- 73 ఏండ్ల వృద్ధుడు పారిపోవడం నమ్మశక్యమేనా?
- రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు నిర్బంధించారు
- సింగరేణి అమ్మకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర
- మావోయిస్టు పార్టీ పేరుతో విడుదలైన లేఖలో సంచలన వ్యాఖ్యలు

కొత్తగూడెం క్రైం, జూలై 10: సాధారణ జీవితం గడుపుతున్న ఓ వృద్ధుడిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కిడ్నాప్ చేసి, ఆపై అరెస్ట్‌గా చిత్రీకరించి కట్టు కథలు అల్లుతున్నారని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో బుధవారం విడుదలైన లేఖ సంచలనం సృష్టిస్తున్నది. మావోయిస్టు పార్టీలో సుదీర్ఘకాలంగా పని చేసి, అరెస్టు అయిన తర్వాత పదేండ్ల క్రితం జైలు నుంచి విడుదలైన మహ్మద్ హుస్సేన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారంటూ ఆ పార్టీ ఆరోపించింది. రెండు నెలల నుంచి సికాస పునర్నిర్మాణం కోసం మందమర్రి, రామకృష్ణాపూర్ ఏరియాలో మావోయిస్టు భావజాలాన్ని తీసుకెళ్తున్నారని, కరపత్రాలు పంచుతున్నారనే నెపంతో ఈ అక్రమ అరెస్టు జరిగిందని లేఖలో పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ సూచనలతో మందమర్రి సీఐ, ఎస్సై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆర్కే-1 మైన్ రోడ్డులో వారిని చూసి పారిపోతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, అతడి నుంచి నల్లటి బ్యాగులో డాక్యుమెంట్లు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు దొరకడంతో అతడిని అరెస్టు చేసినట్టు కట్టు కథ అల్లారని లేఖలో ఉంది. పదేండ్లుగా జమ్మికుంటలో సాధారణ జీవితం గడుపుతున్న 73 ఏండ్ల హుస్సేన్.. పారిపోతుండగా పట్టుకున్నట్టు సృష్టించిన కట్టు కథ ప్రజలు నమ్మదగినదిగా లేదని విమర్శించారు. జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. దేశ, విదేశ కార్పొరేట్లతో ఎన్నడూ లేని విధంగా రూ.37,870 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఇందులో ఒక అదాని గ్రూపు వాటానే రూ.12,400 కోట్ల పెట్టుబడి అని, విద్యుత్తు, డేటా సెంటర్, ఏరోస్పేస్, డిఫెన్స్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ తదితర రంగాల్లో అదాని గ్రూప్ పెట్టుబడులు పెడుతుందని, అందులో భాగంగానే దక్షిణ తెలంగాణ విద్యుత్తు సంస్థ (టీజీఎస్‌పీడీఎల్) పలు సర్కిళ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఒప్పందం కుదుర్చుకున్నదని ఆరోపించారు. ఇప్పటికే హైదరాబాద్ పాత బస్తీలో విద్యుత్తు బకాయిల వసూళ్లను, విద్యుత్తు భూగర్భ లైన్లు వేసే కాంట్రాక్టును అదానికి అప్పగించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్గత ఒప్పందం చేసుకుని సింగరేణి బొగ్గు బ్లాక్‌ల అమ్మకానికి సిద్ధమయ్యాయని వివరించారు. దీంతో కార్మికులు సింగరేణి బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాలను అణిచివేయడానికి కుట్రలు చేస్తున్నాయని, నాయకత్వం వహిస్తున్న వారిపై మావోయిస్టు ముద్ర వేసి అరెస్టులు చేస్తున్నాయని ఆరోపించారు. డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వడానికి ఒక నెల గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరిన విద్యార్థులను అరెస్టు చేసి కేసులు పెడుతున్నారని విమర్శించారు. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణహోమాన్ని చూసి చలించిపోయి, ఈ నరమేధాన్ని ఆపాలంటూ 'జల్, జంగిల్, జమీన్ మాది' అనే నాటకంతో స్ఫూర్తిని నింపుతున్న నేపథ్యంలో చిన్నపిల్లలను, వారి తల్లిదండ్రులను బెదిరింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. కొద్ది మంది దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం పౌర సమాజంపై, ప్రజల ప్రజాస్వామిక హక్కులపై జరుగుతున్న పాశవిక దాడులను, అక్రమ అరెస్టులను బుద్ధిజీవులు, ప్రజాస్వామికవాదులు, పౌరహక్కుల సంఘాలు, ప్రజాహితం కోరుతున్న వారు ఖండించాలంటూ లేఖలో పేర్కొన్నారు.

పెరిగిన ఆస్ట్రేలియా, బ్రిటన్ వీసా చార్జీలు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): స్టూడెంట్ వీసా చార్జీలను ఆస్ట్రేలియా, బ్రిటన్ పెంచాయి. ఇదివరకు ఆస్ట్రేలియా వీసా ఫీజు 710 ఆస్ట్రేలియన్ డాలర్లు కాగా, ఈ మొత్తాన్ని 1,600 డాలర్లకు పెంచింది. గత ఫిబ్రవరిలో వీసా చార్జీలను బ్రిటన్ 624 పౌండ్ల నుంచి 1,035 పౌండ్లకు పెంచింది. బ్రిటన్, అమెరికా, కెనడా దేశాలతో పోల్చితే ఆస్ట్రేలియా వీసా చార్జీలు అధికంగా ఉండటం విశేషం. అమెరికా వీసా చార్జీ 185 డాలర్లు మాత్రమే. కెనడా వీసా చార్జీ 150 డాలర్లు. గతంలో విద్యార్థుల్లో ఎక్కువ మంది అమెరికా తర్వాత బ్రిటన్‌కు వెళ్లేవారు. తాజాగా ఈ ట్రెండ్ ఆస్ట్రేలియాకు పాకింది. ఆస్ట్రేలియా ఏటా 2.6 లక్షల స్టూడెంట్ వీసాలను జారీచేస్తున్నది. పోస్ట్ స్టడీ వర్క్ వీసాల గడువును సైతం పొడిగించింది. తెలంగాణ నుంచి సైతం గణనీయంగా విద్యార్థులు ఆస్ట్రేలియాకు వెళ్తున్నారు.

నేతన్న ఆత్మహత్యాయత్నం

పనులు లేక అప్పుల బాధతో అఘాయిత్యం • రాజన్న సిరిసిల్లలో ఘటన

సిరిసిల్ల రూరల్, జూలై 10: చేనేత కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్నది. తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన గాజుల వేణు, వైష్ణవి దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు. వస్త్ర పరిశ్రమలో వైపని కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వైష్ణవి బీడీలు చుడుతూ భర్తకు చేదోడు.. వాదోడుగా ఉంటున్నది. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడంతో ఉపాధిలేక వేణు సతమతమవుతున్నాడు. గతంలో తీసుకున్న సూక్ష్మ రుణాల వాయిదాలు చెల్లించలేకపోతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సిరిసిల్ల దవాఖానకు తరలించారు. త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు స్థానికులు తెలిపారు.



బాలెంల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నుంచి సూర్యాపేట కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థినులు

15 కి.మీ నడిచి విద్యార్థినుల నిరసన

- బాలెంల గురుకుల డిగ్రీ కాలేజీ విద్యార్థినుల పోరుబాట
- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని వారం నుంచి ఆందోళన
- తాజాగా కలెక్టరేట్ వరకు ర్యాలీ
- హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్
- రాత్రి 10 గంటల వరకూ ధర్నా

బొడ్రాయిబజార్/సూర్యాపేట రూరల్, జూలై 10 : సూర్యాపేట జిల్లాకేంద్రం సమీపంలోని బాలెంల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆందోళన ఉధృతం చేశారు. తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. దాదాపు 200 మందికిపైగా విద్యార్థినులు బుధవారం సాయంత్రం కాలేజీ నుంచి సూర్యాపేట కలెక్టరేట్ వరకు 15 కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి నిరసన తెలిపారు. రాత్రి పది గంటల వరకూ అక్కడే బైఠాయించారు. ప్రిన్సిపాల్ శైలజ తమపట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని, మెనూ పాటించడం లేదని, ప్రశ్నిస్తే చేయిచేసుకుంటున్నారని, టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తానని బెదిరిస్తున్నారని విద్యార్థినులు వారం నుంచి ఆందోళన చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో కలెక్టర్ విచారణ కమిటీ వేశారు. నాలుగు రోజులైనా చర్యలు లేకపోవడంతో విద్యార్థినులు బుధవా రం సాయంత్రం కాలేజీ హాస్టల్ నుంచి కలెక్టరేట్‌కు నడిచివచ్చారు. ఆ సమయంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కళాశాలకు చేరుకొని అక్కడ ఉన్న కొందరు విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టరేట్‌కు బస్సు పంపి తిరిగి రావాలని కోరగా, విద్యార్థినులు ససేమిరా అనడంతో కలెక్టరేట్ సమావేశ మందిరానికి వచ్చి వారిని పిలిచి మాట్లాడారు. చర్యలు తీసుకుంటామని హామీనిచ్చి, విద్యార్థినులను ప్రైవేట్ బస్సులో హాస్టల్‌కు పంపించారు.

కోటి టన్నులూ కరువాయె!

- ఈ ఏడాది 95.34 లక్షల టన్నులకే పరిమితం
- ప్రభుత్వం నిర్లక్ష్యం, ప్రణాళికా లోపమే కారణం
- గతంలో ఏటా కోటి టన్నులకు పైగా కొనుగోలు
- 2020-21లో ఏకంగా 1.41 కోట్ల టన్నులు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం కొనుగోళ్లు తిరోగమన దిశలో సాగుతున్నాయి. గత 4 సంవత్సరాల్లో రైతుల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా కోటి టన్నులకుపైగా ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. ఇప్పుడు రేవంత్ సర్కారు కనీసం కోటి టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేకపోయింది. ఎన్నో ఆపసోపాలు పడి ఈ ఏడాది మొత్తంగా 95.34 లక్షల టన్నుల (వానకాలంలో 47.34, యాసంగిలో 48 లక్షల టన్నులు) ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు తగ్గడం 2018-19 తర్వాత ఇదే ప్రథమం. దీంతో రాష్ట్రం ఐదేండ్లు వెనక్కి పోయింది. 2019-20లో ధాన్యం కొనుగోళ్లు తొలిసారి కోటి టన్నుల మార్కును దాటాయి. నాటి నుంచి 2022-23 వరకు ఏ ఏడాదిలోనూ ధాన్యం కొనుగోళ్లు కోటి టన్నులకు తగ్గలేదు. దీంతో ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లు తగ్గడానికి ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రణాళిక లోపమే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగేండ్లలో రికార్డులే రికార్డులు

రాష్ట్రంలోని వరి రైతులకు గత నాలుగేండ్లు స్వర్ణయుగమనే చెప్పుకోవాలి. వరి సాగుతో పాటు ధాన్యం కొనుగోళ్లలోనూ రికార్డుల మీద రికార్డులు నమోదయ్యాయి. రైతులు పోటీపడి ధాన్యం పండిస్తే.. వాటిని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం కూడా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 'మీరు ఎంత పండిస్తారో పండించండి. మొత్తం కొనుగోలు చేస్తాం' అన్నట్టుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగింది. 2018-19లో 77.48 లక్షల టన్నులతో మొదలైన ధాన్యం కొనుగోళ్ల పరంపర 2019-20లో కోటి టన్నుల మార్కు దాటింది. ఆ ఏడాది ఏకంగా 1.11 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన పౌరసరఫరాల సంస్థ.. ఆ తర్వాత ఎన్నడూ వెనుదిరిగిందే లేదు. ఆ మరుసటి ఏడాది రికార్డు స్థాయిలో 1.41 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఇందులో ఏకంగా 92 లక్షల టన్నులు ఒక్క యాసంగిలోనే కొనుగోలు చేసింది. అది కూడా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలోనే ఈ రికార్డులు నెలకొల్పింది. ఆ తర్వాత 2021-22లో 1.21 కోట్ల టన్నులు, 2022-23లో 1.31 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కానీ, ఈ ఏడాది మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా తయారైంది. 'మీరు ఎంతైనా పండించండి. మేం మాత్రం ఎంత కొనాలో అంతే కొంటాం' అన్నట్టుగా రేవంత్ సర్కారు వ్యవహరించింది.

వరి సాగు పెరిగినా.. తగ్గిన కొనుగోళ్లు

వాస్తవానికి గతంతో పోలిస్తే ఈ ఏడాది వరి సాగు పెరిగింది. అయినా ధాన్యం కొనుగోళ్లు తగ్గాయి. ఈ ఏడాది మొత్తం 1.15 కోట్ల ఎకరాల్లో (వానకాలంలో 65 లక్షలు, యాసంగిలో 50.69 లక్షల ఎకరాల్లో) వరి సాగైంది. నిరుడు 1.21 కోట్ల ఎకరాల్లో, 2021-22లో 97.79 లక్షల ఎకరాల్లో, 2020-21లో 1.06 కోట్ల ఎకరాల్లో, 2019-20లో 80.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు.

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

సంవత్సరం	లక్షల టన్నులు
2014-15	24.28
2015-16	23.57
2016-17	54.07
2017-18	54.08
2018-19	77.48
2019-20	111.25
2020-21	141.02
2021-22	120.60
2022-23	130.83
2023-24	95.34

వరి సాగు వివరాలు

సంవత్సరం	విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)
2014-15	34.97
2015-16	25.85
2016-17	45.18
2017-18	48.49
2018-19	47.73
2019-20	80.50
2020-21	106.13
2021-22	97.79
2022-23	121.00
2023-24	115.69